ప్రజాశక్తి
ఆదివారం 28 మే 2023 | 5 | అనంతపురం





జగన్నవిద్యా కానుక కిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

నాణ్యతగా నాడు- నేడు పనులు

కలెక్టర్ ఎమ్. గౌతమి

ప్రజాశక్తి-తాడిపత్రి

నాడు- నేడు కింద చేపట్టిన పనులను నాణ్యతగా చేపట్టాలని ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ ఎమ్.గౌతమి అధికారులను ఆదేశించారు. శనివారం నాడు తాడిపత్రి పట్టణం సజ్జలదిన్నె మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో చేపట్టాల్సిన పనులు ఇంకా పూర్తి కాలేదని, వీటిని అనుకున్న సమయంలోపు పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రస్తుతం సిమెంటు, ఇసుక సమస్యలు లేవని, పనులు పూర్తయిన వెంటనే బిల్లులు కూడా చెల్లిస్తున్నామని చెప్పారు. అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పనులను పూర్తి చేయించాలన్నారు. అనంతరం తాడిపత్రి పట్టణం ఎపి మోడల్ పాఠశాలలో నిల్వచేసిన జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. సరఫరా చేస్తున్న వస్తువులు నాణ్యత లేకపోతే వాటిని వెంటనే తిప్పి పంపాలన్నారు. అన్నివస్తువులు స్టాక్ పాయింట్ చేరుకున్నాక సకాలంలో పాఠశాలలకు వాటిని సరఫరా చేయాలని ఆదేశించారు.

మరింత వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు : కలెక్టర్

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. తాడిపత్రి పట్టణం సజ్జలదిన్నె జగనన్న లేఅవుట్‌లో నూతనంగా నిర్మించిన లబ్ధిదారురాలు ఎమ్.సరోజమ్మ గృహాన్ని కలెక్టర్ ప్రారంభించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు సకాలంలో గృహాలను నిర్మించుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి కూడా ఎప్పటికప్పుడు బిల్లులను చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఆయా కాలనీలలో మౌలిక వసతులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో 67 వేల ఇళ్ల మంజూరు కాగ ఇందులో ఇప్పటికే జిల్లాలో 14 వేల ఇళ్లు పూర్తయ్యాయని చెప్పారు. మరో 6000 గృహాలను పూర్తయ్యే దశలో ఉన్నాయన్నారు. ఇంకా ఇల్లు లేని నిరుపేదలు ఉంటే దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో వారికి ఇంటి పట్టాను మంజూరు చేస్తామన్నారు. అనంతరం సజ్జలదిన్నె జగనన్న లే ఔట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో మధుసూదన్, ఎంపీపీ సరస్వతి, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, డీఎడ్డీవో ఓబులమ్మ, తహశీల్దార్ మునివేలు, ఎంపీడీవో రంగారావు, మునిసిపల్ కమిషనర్ బి.శేషన్న, ఈఓఆర్డీ జిలాన్‌బాషా, ఏపీఎం రాజశేఖర్, హౌసింగ్ డీఈలు, ఈఈలు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు

- ఈనెల 30న రైతు భరోసాతో పాటు పంపిణీ
- శింగనమలకు అత్యధికం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వం రైతు భరోసాతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీని రైతులకు అందజేయనుంది. ఈనెల 30వ తేదీనే రైతు భరోసాతోపాటు దీనినిని వేయనుంది. ఉద్యానవన పంటలు, వ్యవసాయ పంటలు దెబ్బతిన్న పంటలు రెండింటికీ రూ.8.35 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేయనుంది. సత్యసాయి జిల్లాకు రూ.49.20 లక్షలు రానుంది. అనంతపురం జిల్లాలో 1946 హెక్టార్లలో వ్యవసాయ పంటలు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పడిన అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. దీనికి సంబంధించి మొత్తం 2832 మంది రైతులకు నష్టం వాటిల్లింది దీనికి సంబంధించి రూ.2.60 కోట్లు మంజూరు చేశారు. ఇక ఉద్యానవన పంటలకు సంబంధించి 2356 హెక్టార్లలో 2479 మంది రైతులకు నష్టం వాటిల్లింది. దీనికి సంబంధించి రూ.5.75 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రానుంది. రెండు రకాల పంటలకు సంబంధించి 5311 మంది రైతులు 4303 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. రెండు రకాల పంటలకు కలిపి మొత్తం రూ.8.35 కోట్లు మంజురైంది. సత్యసాయి జిల్లాకు సంబంధించి వ్యవసాయ పంటలకు రూ.31.22 లక్షలు, ఉద్యానవన పంటలకు సంబంధించి రూ.17.97 లక్షలు మంజూరైంది. మొత్తం రూ.49.20 లక్షలు మంజూరైంది.

శింగనమలకే అత్యధిక పరిహారం

పంటనష్ట పరిహారానికి సంబంధించి అనంతపురం జిల్లాలో శింగనమల నియోజకవర్గం పరిధిలోనే అత్యధికంగా వ్యవసాయ పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ అందనుంది. 1611 హెక్టార్లకు సంబంధించి రూ.2.01 కోట్లు పరిహారం రైతులకు అందనుంది. మార్చి నెలలో నార్పల మండలంలో పడిన వడగండ్ల వానకు పెద్దఎత్తున పంటలకు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. శింగనమల, పుట్లూరు, నార్పల మండలాల్లో ఎక్కువగా పంటలకు నష్టం వాటిల్లింది. ఈ ప్రాంతంలోనే ఇన్‌పుట్ సబ్సిడీ అధికంగా రానుంది. ఉద్యానవన పంటలు కూడా ఈ ప్రాంతంలోనే అధికంగా నష్టం వాటిల్లడంతో ఆ పంటలకు ఈ మండలాల్లోనే అధికంగా ఇన్‌పుట్ సబ్సిడీ రానుంది.

రైతు భరోసానూ పంపిణీ

రైతు భరోసా మొత్తాన్ని కూడా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఇది వరకే ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.158 కోట్లు మంజూరు చేయనున్నారు. దీంతో అధిక వర్షాలతో మార్చి, ఏప్రిల్ , మే నెలలో దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా రానుండటంతో సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం పంటనష్టాన్ని, రైతు భరోసానూ రైతులకు అందజేయనుంది. ఈ సీజన్ పెట్టుబడులకు ఈ రెండు ఇవ్వడంతో రైతులకు కొంత ఊరట లభించనుంది. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో రెండింటి వలన అధిక వర్షాలకు రైతులకు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం పంటనష్టంతోపాటు, రైతు భరోసాను కలిపి ఒకేసారి ఇవ్వడంతో నష్టపోయిన రైతుకు ఒకేసారి రెండు కలసి రావడంతో ఈ ఖరీఫ్‌కు పెట్టుబడులకు ఇబ్బందులేకుండా ఉండేందుకు వీలుంది.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా వి.రాంభూపాల్



వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా వి.రాంభూపాల్ ఎన్నికయ్యారు. శుక్రవారం నాడు విజయవాడలో జరిగిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశంలో రాంభూపాల్‌ను రాష్ట్ర కార్యదర్శవర్గ సభ్యులుగా ఎన్నిక చేశారు. అనంతపురం జిల్లా సిపిఎం కార్యదర్శిగా ఆయన ఉన్నారు. ఇప్పటి వరకు వరుసగా మూడు పర్యాయాలు సిపిఎం జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అదేవిధంగా రాష్ట్ర కమిటీ సభ్యులుగానూ ఉంటూ వచ్చారు. విద్యార్థి ఉద్యమం నుంచి సిపిఎం పార్టీలో పనిచేస్తూ వస్తున్నారు. అనంతపురం నగర కార్యదర్శిగానూ, జిల్లా కార్యదర్శిగానూ పనిచేసిన ఆయనకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గంలో ఇప్పుడు ఎన్నుకున్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్లూరు

ఉపాధి హామీ కూలీల సంఖ్యను మరింత పెంచి పనిదినాలు కల్పించాలని కలెక్టర్ ఎమ్.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం పుట్లూరు మండలం కందికాపుల పంచాయతీ చింతకుంట గ్రామ సమీపంలో ఉపాధిహామీ పథకం కింద సుబ్బరాయసాగర్ నుంచి పుట్లూరు చెరువు వరకు చేపడుతున్న ప్రధాన కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూలీలు వారి పిల్లలను అందులోనూ ఆడపిల్లలను బాగా చదివించాలని సూచించారు. వర్షాకాలంలో సుబ్బరాయ సాగర్ నుంచి కాలవలో నీరు వస్తుందని, ఈ కాలువ దాటుతూ తమ గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బంది ఉన్నందున కల్వర్టు నిర్మించాల్సిందిగా గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో మధుసూదన్, ఏపీడీ వెంకటరత్నం, డీఎల్డీవో ఓబులమ్మ, తహశీల్దార్ సుమతి, ఎంపీడీవో యోగానంద రెడ్డి, ఏపీవోలు చెన్నకేశవులు, భాగ్యలక్ష్మి చింతకుంట గ్రామ సర్పంచి కె.శివరామయ్య, ఇన్‌ఛార్జి జేఈ విజయ్ పాల్గొన్నారు.

కష్టానికి తగ్గ ఫలితం లేదు..

సిపిఎం నాయకుల ఎదుట 'ఉపాధి' కూలీల ఆవేదన

ప్రజాశక్తి-పుట్లూరు

ఉపాధి హామీ చట్టం కింద పనులు చేస్తున్నా కష్టానికి తగ్గ ఫలితం లేకుండా పోతోందని పలువురు ఉపాధి హామీ కూలీలు వాపోయారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చింతకుంట్ల గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై కూలీలు ఏకరువు పెట్టారు. ముఖ్యంగా ఎంత పని చేసినా వంద నుంచి రూ.120 వరకూ మాత్రమే కూలి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మెడికల్ కిట్టు, మజ్జిగ, టార్పాలిన్ వంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, మండల కార్యదర్శి విటి రామాంజనేయులు, మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, లక్ష్మీదేవి, నాగమ్మ, నాగశ్రీ, శ్రీవిద్య, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీల సమస్యలను తెలుకుంటున్న సిపిఎం నాయకులు

సర్ థామస్ మన్రోకు నివాళి

గుత్తి : దత్త మండలాల మొట్టమొదటి కలెక్టర్ సర్ థామస్ మన్రో జయంతిని పురస్కరించుకుని గుత్తి కోట వద్ద ఉన్న సమాధి వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ బుద్ధ అభివృద్ధి సమాఖ్య అధ్యక్షుడు ఎం.సురేష్‌బాబు, గుత్తి కోట పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఇస్మాయిల్, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, సిపిఐ మండల కార్యదర్శి జి. రామదాసు తదితరులు పాల్గొన్నారు.



మన్రో సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



నెహ్రూకు నివాళి అర్పిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

దేశాభివృద్ధిలో సాంకేతిక రంగం కీలకం

జెఎన్‌టియు రెక్టార్ ఎం.విజయకుమార్

ప్రజాశక్తి-అనంతపురం

దేశం అభివృద్ధి చెందడలో సాంకేతిక రంగం తోడ్పాటు ఎంతో అవసరం అని జెఎన్‌టియు రెక్టార్ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక జెఎన్‌టియు పరిపాలన భవనంలో పండిట్ జవహర్ లాల్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ సాంకేతిక రంగం అబివద్ధి చెందినప్పుడు దేశం అబివద్ధి సాధిస్తుందని జవహర్‌లాల్ నెహ్రు చెప్పారన్నారు. పరిశోధనాత్మకంగా ఆలోచించినప్పుడు నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందన్నారు. నెహ్రూ అడుగుజాడల్లో నేటి విద్యార్థులు నడిచి సాంకేతిక రంగంపై పట్టు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ పి.సుజాతతో పాటు భోధన, భోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య రహిత సమాజానికి కృషి

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరామప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజలతో మమేకమై కాలుష్య రహిత సమాజం కోసం సమిష్టిగా పాటుపడదామని రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరామప్రసాద్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు నగరంలోని టవర్ క్లాక్ వద్ద రోడ్డు రవాణా సంస్థ, ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు కాలుష్య రహిత సమాజం కోసం కృషి చేయాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా వాయు కాలుష్యంలో ప్రధానంగా 70 శాతం పొల్యూషన్ ద్విచక్ర వాహనాల ద్వారా వస్తుందన్నారు. బిఎస్ 6 వంటి నూతన ఉత్పత్తుల వల్ల పెట్రోల్ డీజిల్ వాడకం తగ్గి బ్యాటరీ వాహనాల వాడకం పెరగడం వల్ల వాయు కాలుష్యం నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. అయితే ఇందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సురేష్‌నాయుడు, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు అటిక, సునీత, శ్రీనివాసులు, రఘునాథ్, డి.శ్రీనివాసులు, కానిస్టేబుల్ నర్సింహులు, ట్రాఫిక్ సిఐ వెంకటేష్‌నాయక్, ఎస్ఐ వంశీకృష్ణ, రంగస్వామి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : సమస్త ప్రాణకోటి మనుగడకు అవసరమైన పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, సచివాలయ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణహిత జీవనశైలిపై 2కె రన్ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ప్రారంభమైన 2కె రన్ క్లాక్ టవర్ కూడలి వరకూ వెళ్లి తిరిగి నగరపాలక సంస్థకు చేరుకుంది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మనందరి దైనందిన అలవాట్లలో చిన్న, చిన్న మార్పులతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంపై నియంత్రణ, జౌళి సంచుల వాడకం, విద్యుత్ ఆదా, సోలార్ వస్తువుల వినియోగం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కాలుష్య ఉద్గారాల నియంత్రణ, తక్కువ దూరాలకు సైక్లింగ్, ఎలివేటర్ బదులుగా మెట్లను వాడటం వంటి చర్యలతో మార్పుకోసం ప్రయత్నించాలని కోరారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : వాహన కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తమవంతు కృషి చేయాలని రవాణా శాఖ మోటార్ వాహనాల తనిఖీ అధికారి విశ్వనాథరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర రవాణా శాఖ చేపట్టిన 'మిషన్ లైఫ్' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని వినాయక కూడలిలో అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను ఎప్పటికప్పుడు కాలుష్య నియంత్రణ తనిఖీ చేపట్టడం, సక్రమ నిర్వహణ వల్ల కాలుష్యాన్ని చాలావరకు తగ్గించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్, కాలుష్య తనిఖీ కేంద్రం సిబ్బంది, పోలీసు, రవాణా శాఖ సిబ్బంది, వాహన చోదకులు, తదితరులు పాల్గొన్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయంలో 2కె రన్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ రమణారెడ్డి



అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరామప్రసాద్, రాయదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాష్ట్ర జాతాను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున



కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ నుంచి చేపట్టనున్న రాష్ట్ర జాతను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం రాయదుర్గంలో మున్సిపల్ కార్మికులతో సమావేశం ఏర్పాటు ఇందుకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్ యాక్టివిటీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, 101 పద్దు కింద వేతనాలు చెల్లించాలని తదితర డిమాండ్లతో ఈనెల 31 నుంచి జూన్ 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జాతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాతాలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, మున్సిపల్ యూనియన్ నాయకులు రాము, తిప్పేస్వామి, మల్లేసి, సిద్ధలింగ, ఆదిలక్ష్మి, వన్నూరుస్వామి, విజయ్, ఎర్రిస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి

శింగనమల : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి శనివారం అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు కథలు, పుస్తకాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గోవిందు, జి.కృష్ణ, గ్రంథాలయాధికారిణి, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కష్టాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం కలిగిన ప్రాంతంగా అనంతపురం జిల్లా ఉంది. 2004కు ముందు తీవ్రమైన దుర్భిక్షంతో ఇక్కడ ప్రజలు పెద్దఎత్తున వలసలు తరలివెళ్లారు. గ్రామాలకు గ్రామాలు ఖాళీగ దర్శనమిస్తూ ఉండేవి. అయితే 2004లో వామపక్షాల మద్దతుతో యుపిఎ-1 ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కామన్ మినిమం ప్రోగ్రాం కింద వామపక్షాల చొరవతో ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని తీసుకొచ్చాక 2005లో అనంతపురం జిల్లాలోనే వ్యవసాయ కార్మికులకు వంద రోజుల పనిని ప్రభుత్వం హామీగా నిచ్చింది. ఇప్పటి ప్రారంభమై సరిగ్గా 18 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో అప్పటి నుంచి ఇప్పటి వరకు చూస్తే ఈ పథకం యొక్క ప్రయోజనం ఏ పాటిదో అర్థమవుతుంది. ఇది పూర్తి స్థాయిలో అమలు జరగకపోయినా సగటున పనిదినాలు 58 రోజుల వరకు ఉంటున్నాయి. ఈ రోజుల పనికే గ్రామాలు అంతోఇంతో నిలబడి ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. కూలి సైతం ఆ తరువాత పెరిగిందని చెబుతుంటారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలు చేపడుతుంటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. గడిచిన నాలుగేళ్లుగా వేతనాల్లోనూ తగ్గుదల కనిపిస్తోంది. కనీస సౌకర్యాలన్నింటినీ తొలగించడం



తోపాటు, వేతనాల్లోనూ కోతలు పెడుతోంది. దీంతో వ్యవసాయ కార్మికులకు తిరిగి పూర్వపు కష్టాలు మొదలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అంశంపై ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనంతపురం, ఇటు సత్యసాయి జిల్లా రెండు చోట క్షేత్ర స్థాయికెళ్లి పరిశలనలు సైతం చేపట్టింది. ఉపాధి హామీ కార్మికుల వద్దకెళ్లి వారి కష్టాలు తెలుసుకుంది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికులు వెసవి అలవెన్సులో కోత ఉందని, రవాణా అలవెన్సులూ ఇవ్వడం లేదని చెప్పారు. గత కంటే ఇప్పటి వేతనాల్లో 30 శాతం తగ్గుదల ఉందన్న విషయాన్ని తెలియజేశారు. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతను వ్యవసాయ కార్మికులకు తెలియజే ప్రయత్నం ఈ వారం రోజులు వ్యసాయ కార్మిక సంఘం నాయకులు చేశారు. వేతనాన్ని రూ.600లకు పెంచాలని డిమాండ్ చేశారు. పని దినాలకు 200 రోజులకు పెంచాలని కోరారు. ఈ డిమాండ్లపై సత్యసాయి, అనంతపురం జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు హాజరయ్యారు. జిల్లాకు ఇంతటి అత్యంత ప్రాధాన్యతమైన ఉపాధి హామీ పథకం నిర్వీర్యమవుతున్నా ఇతర అధికార, ప్రతిపక్ష పార్టీలు ఈ సమస్యపై స్పందించకపోవడం విమర్శలకు సైతం తావిస్తోంది. ఇక ఈ వారంలో వ్యవసాయ మరో ప్రధాన అంశమైంది. ఒకవైపు ఎండలు, మరోవైపు వర్షాలు పడటంతోపాటు ఖరీఫ్ సీజన్ దగ్గరకు రావడంతో రైతులు ఆ పనులకు సమాయత్తమవుతున్నారు. విత్తనం, విత్తు రెండింటినీ సిద్ధం చేసుకునే పనిలో రైతులున్నారు. ప్రభుత్వం కూడా ఈ వారంలో రైతు భరోసా చెల్లిస్తామని ప్రకటించింది. ఇది కొంత పెట్టుబడలకు ఊరట లభించే అవకాశముంది. వ్యవసాయ కూలీలు, రైతుల సమస్యలు రెండూ ఒకేసారి ప్రధాన అంశాలుగా ఈ వారంలో ముందుకొచ్చాయి.



గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి

ప్రజాశక్తి-పుట్లూరు

గృహ నిర్మాణదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ యోగానందరెడ్డి సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చింతకుంట, కందికాపుల గ్రామాల్లో పర్యటించి గృహ నిర్మాణదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణ బిల్లులు పడ్డాయా.. సిమెంట్ ఇస్తున్నారా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, హౌసింగ్ ఎఇ లోకేష్ కుమార్, పంచాయతీరాజ్ ఎఇ యుక్షమనాయుడు, ఆర్‌డబ్ల్యు ఎఇ రామలింగారెడ్డి, వెలుగు ఎపిఎం వెంకటరామిరెడ్డి, ఆర్‌బి క్రిష్ణప్ప, పంచాయతీ కార్యదర్శి హర్షవర్ధనరెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అనిలకుమార్, సర్పంచ శివరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



మృతిచెందిన రైతు శ్రీనివాసులు

కళ్యాణదుర్గం : అనంతపురం- కళ్యాణదుర్గం ప్రధాన రహదారిలో గోళ్ల గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు శ్రీనివాసులు (62) అక్కడికక్కడే మృతిచెందాడు. పట్టణంలోని కోటవీధిలో నివాసముంటున్న శ్రీనివాసులుకు వెంకటంపల్లి వద్ద బొప్పాయి తోట ఉంది. దీంతో తోటకు ఎరువులు తీసుకునేందుకు పట్టణానికి బయలుదేరాడు. అయితే అనంతపురం వైపు నుంచి మడకశిరకు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య ఆదెమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె : బాలికను లైంగికంగా వేధించిన కేసులో వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఉరవకొండ ప్రాంతం నుంచి జీవనోపాధి కోసం గార్లదిన్నెకు వలస వచ్చిన కుటుంబంలోని బాలికను అస్సాంకు చెందిన యువకుడు పప్పురాజా లైంగిక దాడి చేసినట్లు బాధిత బాలిక తండ్రి ఫిర్యాదు చేశాడన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడంతోపాటు అరెస్టు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

సోమందేపల్లి : స్థానిక వాల్మీకి సర్కిల్ సమీపంలో నివాసం ఉంటున్న నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు వడ్డే గోపి(39) శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఇం ట్లోనే ఉరి వేసుకొన్నాడు. కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో పెనుగొండ ప్రభుత్వాసు పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. గోపికి భార్యతో పాటు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. వాల్మీకి సర్కిల్‌లో దుస్తుల దుకాణం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తుండేవాడు. ఇంటి పెద్దదిక్కు మరణించడంతో దిక్కులేని వారమైపోయామని భార్యా పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలిసిన వెంటనే నియోజకవర్గానికి చెందిన పలు వురు టిడిపి నాయకులు గోపి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించా రు. పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో శవానికి పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని తారకరామాపురంలో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు వేణుగోపాల్ శనివారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానకి పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తారకరామాపురానికి చెందిన వేణుగోపాల్ కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబ విషయంలో శనివారం భార్య వసుంధరతో గొడవపడ్డాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ధర్మవరం టౌన్ : పెయింటర్ సాకే నవీన్‌కుమార్ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ సీఐ వహీద్‌బాషా తెలిపారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం వారు విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక సిద్దయ్యగుట్ట సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి పెయింటర్ సాకే నవీన్‌కుమార్‌ను దుండగులు దారుణంగా హత్య చేయగా కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామన్నారు. అందులో భాగంగా వన్‌టౌన్ సీఐ, ట్రాఫిక్ సీఐ ఆధ్వ ర్యంలో రెండు బందాలుగా ఏర్పడి హత్యకు గల కారణాలు తెలుసుకోవడంతో పాటు నిందితు డు నిమ్మలరెడ్డి శేఖర్‌ను 24 గంటల్లోపే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సాకే నవీన్ కుమార్ పెయింటర్ వత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. నిమ్మలరెడ్డి శేఖర్ అన్నమయ్య జిల్లా కంబలపల్లి మండలంలోని కప్పలవారిపల్లి గ్రామానికి చెందినవాడు. బేల్దారి పనులు చేసుకుంటూ జీవించేవాడు. వీరికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో వారు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద మద్యం తాగారు. అనంతరం శేఖర్ దేవాలయంలోకి వెళ్తుండగా నవీన్ అభ్యంతరం తెలపడంతో ఘర్షణ చోటు చేసుకొంది. ఈ క్రమంలో శేఖర్ అక్కడ ఉన్న బండరాయితో నవీన్‌పై విక్షణారహితంగా డాడి చేసి హత్య చేశాడు. ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకుని నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సమాచారం అందడంతో శనివారం సాయంత్రం 4.15 గంటల సమయంలో గాంధీనగర్‌లో నిందితుడు శేఖర్‌ను అరెస్టు చేశారు. హత్య కేసును 24 గంటల్లోపే ఛేదించినందుకు ఎస్పీ మాధవరెడ్డి ధర్మవరం వన్ టౌన్ సీఐ సుబ్రమణ్యం, ట్రాఫిక్ సీఐ వహీద్ బాషా, సిబ్బందిని అభినందించారు.

రూ.10కోట్లతో పాఠశాలల అభివృద్ధి

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నాడు-నేడు పథకం 2వ దశలో 33 పాఠశాలలను దాదాపు రూ.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. నాడు-నేడు కింద నగరంలోని 26 డివిజన్ పరిధిలో ఉన్న అంబేద్కర్ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సిఎం జగన్ సహకారంలో ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు విద్యా వ్యవస్థలో సిఎం జగన్ తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మీనాక్షమ్మ, అనిల్‌కుమార్‌రెడ్డి, రామాంజినేయులు, డిఇ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

కమిషనర్ రమణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యలపై శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ ఛాంబర్‌లో టౌన్, ట్రాఫిక్ డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన రహదారి భద్రత జాయింట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాలను అనుసరిస్తూ నగరంలో రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నగరంలో ఆర్‌టిసి బస్టాండ్ వెలుపలికి వచ్చే చోట ట్రాఫిక్, బ్లాక్ స్పాట్ అయిన రామ్‌నగర్ ఫ్లైఓవర్ నుంచి పవిత్ర మార్ట్ కూడలి వద్ద ప్రమాదాల నివారణ, శని, ఆదివారాల్లో మార్కెట్ యార్డు వద్ద అధిక ట్రాఫిక్ సమస్యలు కలుగుతున్నాయన్నారు. ఇందుకు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయుట, తోపుడు బండ్లు, వీధి వ్యాపారుల కోసం (జోన్స్) విభాగాలను గుర్తించి వారిని ఆయా ప్రాంతాలకు పంపాలన్నారు. అలాగే రోడ్లపై ఆవులు సంచరించకుండా యజమానులకు నోటీసులు పంపాలన్నారు. అయినా వినకుంటే చర్యలు తీసుకోవాలన్నారు. ఫుట్‌పాత్‌లపై ప్రజల నడకదారికి అడ్డుగా ఉన్న బంకులు, ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌టిసి డిపో మేనేజర్ నాగభూపాల్, నేషనల్ హైవే డిఇ జగదీష్‌గుప్త, రోడ్లు, భవనాల శాఖ డిఇ బాలకటయ్య, ట్రాఫిక్ సిఐ వెంకటేష్‌నాయక్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎఇ, నగరపాలక ఇంజినీర్లు, పట్టణ ప్రణాళిక సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

వేలంపాటలు వాయిదా

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం కూరగాయల మార్కెట్ ఆవరణలో మొదటి అంతస్తు షాపు రూములు, హాళ్ల వేలంపాటలు శక్రవారం వాయిదా పడ్డాయి. మార్కెట్ మొదటి అంతస్తులో 52 షాపు రూములు, రెండు హాళ్లను అద్దెకు ఇచ్చేందుకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే వివిధ కారణాల వల్ల రూములను అద్దెకు తీసుకునేందుకు ఎక్కువమంది ముందుకు రాలేదు. వచ్చిన వారు కూడా ధరావత్ సొమ్ము చెల్లించలేదు. దీంతో మున్సిపల్ అధికారులు వేలంపాటను వాయిదా వేశారు. తిరిగి జూన్ 8న వేలంపాటలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.



వేలం పాటకు ఎవరూ హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

బాల్య వివాహాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి-యాడికి

బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ తహశీల్దార్ బాలమ్మ సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనపై శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్లకు వివాహం చేస్తే కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంతేగాకుండా బాలికలకు వివాహం చేస్తే రెండేళ్ల జైలు, జరిమానా తప్పదని వివరించాలన్నారు. మైనర్‌ను బాలికను వివాహం చేసుకుని సంసారం చేస్తే ఫోక్సో చట్టం ప్రకారం వధూవరుల తల్లిదండ్రులకు 10 నుంచి 20 సంవత్సరాల జైలు, జరిమానా, జీవిత ఖైదు విధించనున్నట్లు తెలిపారు.

బైబిల్‌మిషన్‌లో ప్రజాప్రతినిధుల ప్రార్థనలు

ప్రజాశక్తి-గుత్తి

స్థానిక పట్టణంలోని లచ్చానుపల్లి రోడ్డులో ఉండే బైబిల్ మిషన్ ప్రార్థనశాలలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనశాలలో మూడు రోజులుగా ప్రార్థనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, ఎంపిపి జి.విశాలాక్షి, గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో బైబిల్ మిషన్ ప్రార్థనాశాల పాస్టర్ రెవ.అద్భుత కుమార్, మణికుమారి ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వి.వరదరాజులు, ఎస్.ఫారుక్, వాల్మీకి శివ, రమణ, వైసిపి నాయకులు వై. రామ సుబ్బారెడ్డి, గురుప్రసాద్ యాదవ్, హరినాథ్‌రెడ్డి, మల్లికార్జున, ఎల్ఐసి హరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మహిళలను ఆశీర్వదిస్తున్న పాస్టర్

In the Court of 2nd Addl. Junior Civil Judge: Ananthapuramu

O.S.No:1406/2022

Between:

Vadde Nallamma ...Plaintiff

And

1.Vadde Ramanjineyulu
2.Vadde Nallappa ...Defendants

Notice to

1.Vadde Ramanjineyulu S/o Vadde Nallappa
2.Vadde Nallappa S/o Vadde Nallappa
Both are R/o D.No.2-52, Kanumpalli (V), Garladinne Mandal, Ananthapuramu District.

Sirs,

Whereas the above named Plaintiff filed the above suit against both of you for grant of permanent injunction, both of you are hereby require to appear before the Hon'ble Court on 17-08-2023 at 10.30 A.M. by person or by pleader to show cause against the case, failing which the said matter will be heard and determined by ex parte.

(By order of the Court)

N.Jayaram
Advocate for the Peitioner.

ఖైదీల్లో మార్పు రావాలి

జడ్జి జయలక్ష్మి

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని న్యాయ సేవాధికార సంస్థ మండల ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి సూచించారు. ఆమె శనివారం పట్టణంలోని జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి శిక్ష నిమిత్తం జైలుకు వచ్చారని, సత్ప్రవర్తనతో మెలిగి జైలు నుంచి తొందరగా విడుదలవ్వాలని వారికి సూచించారు. అలాగే జైలులో ఖైదీల స్థితిగతులు, వారికి కల్పిస్తున్న భోజన వసతి, ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఖైదీలకు కల్పించే హక్కుల గురించి వివరించారు. ఖైదీలకు అందించే ఆహారం, వంటగదిని పరిశీలించారు. జడ్జి వెంట న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేశ్వర్‌రెడ్డి. న్యాయవాదులు నరసింహులు, వెంకటేష్, సిరాజుద్దీన్, రఘు, జైలు సూపరింటెండెంట్ వాసుదేవరెడ్డి తదితరులు ఉన్నారు.

వాలంటీర్‌కు ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి-ఉరవకొండ

గుండె ఆపరేషన్ చేయించుకుని విడపనకల్ మండల పరిధిలోని వి.మాలాపురం గ్రామంలో వాలంటీర్ కె.ఓబులేసును ఎమ్మెల్యే వై.శివరామిరెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆధైర్య పడవద్దని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ వెంట విడపనకల్లు మాజీ ఎంపిపి రమణారెడ్డి, డోనేకల్ రాంబాబు, వైసిపి నాయకులు కేసన్న, గురుస్వామి, గోపీ, డీలర్ రవి, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీలేఖ, భూమా విజయ్, లోక, రాజు, సురేష్, బెల్లం వెంకటేష్, తదితరులు ఉన్నారు.



వాలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

కదిరి వ్యవసాయ పరిశోధన స్థానానికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఉత్తమ విత్తనోత్పత్తికి (2022 సంవత్సరానికి) గానూ భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి జాతీయ అవార్డు అందజేసింది. గుజరాత్ రాష్ట్రంలోని జునాఘడ్ జాతీయ వేరుశనగ పరిశోధన కేంద్రంలో ఈ నెల 24 నుంచి 26 వరకు జాతీయ స్థాయిలో వేరుశనగ శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారని, అందులో కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ 2022లో అధిక మొత్తంలో వేరుశనగ విత్తనోత్పత్తి చేసి దేశంలోని వివిధ రాష్ట్రాలకు వేరుశనగ కాయలు ఎగుమతి చేసినందుకు గానూ భారతీయ వ్యవసాయ పారిశోదన మండలి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టిఆర్ శ్యామ, డైరెక్టర్ డాక్టర్ బెవ అవార్డు అందజేశారన్నారు. ఈ అవార్డు దక్కడం పట్ల డాక్టర్ సంపత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. కదిరి వ్యవసాయ పరిశోధన స్థానానికి అవార్డు వచ్చినందుకు ప్రధాన శాస్త్రవేత్త సంపత్, శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేష్, వేమన, వెంకటరమణలకు జాతీయస్థాయిలో ప్రశంసలు దక్కాయి.

అసమ్మతి నాయకులతో మంత్రి పెద్దిరెడ్డి సమావేశం

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గ పరిస్థితులపై వైసిపి రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ పరిశీలకులు బాబురెడ్డి, ఎంఆర్‌సి రెడ్డితో కలసి శనివారం తిరుపతిలోని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసంలో సుమా రు 3 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వారు పార్టీలో తమకు జరిగిన అన్యాయాన్ని పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పెనుకొండ వైసిపి నాయకులు పుప్పం సుధాకరరెడ్డి, గంపల రమణారెడ్డి, అక్కులప్ప,చాలకూరు అశ్వర్థమ్మ, సి.నారాయణరెడ్డి, నాగభూషణ రెడ్డి, దిలీప్ రెడ్డి, బీచగానిపల్లి బాలాజీ, కక్ర సంజీవరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, గోపాలరెడ్డి, కష్టారెడ్డి, మురళి, తురకలపట్నం నరేంద్ర రెడ్డి, గుడిపల్లి కళ్యాణ్, చెన్నకష్టారెడ్డి, గోరంట్ల లక్ష్మీనరసప్ప, మోతుకపల్లి శ్రీనివాసరెడ్డి, బొమ్మిరెడ్డి పల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

ముస్లిముల అభివృద్ధికి తోడ్పాటు

అనంతపురం : వైసిపి ప్రభుత్వం ముస్లిముల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. నగరంలోని పోలీస్ ఫంక్షన్ హాల్‌లో హజ్ యాత్రికులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు, వ్యాక్సినేషన్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హజ్ యాత్రకు వెళ్తున్న వారందరూ సుఖ,సంతోషాలతో యాత్రను పూర్తి చేసుకోవాలని కాంక్షించారు.

నేడు ఎంజెపి జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్ష

లేపాక్షి : స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల గురుకుల కళాశాలలో ప్రవేశానికి ఆదివారం(నేడు) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలల జిల్లా కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్షకు విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్ వెంట తీసుకురావాలని సూచించారు. లేపాక్షి గురుకుల పాఠశాలలో 686 మంది, ననసకోటలో 436, గుడిబండలో 320, టేకులోడులో 322, గుండుమలలో 199 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాయనున్నారన్నారు.

గాంధీ హరిజన హాస్టల్ విడపనకల్ మండల కమిటీ ఎన్నిక

ఉరవకొండ : మండల కేంద్రంలోని శ్రీ గాంధీ హరిజన హాస్టల్ విడపనకల్ మండల కమిటీని మండల ఇన్‌ఛార్జి కేంగురి ఎర్రిస్వామి ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా హావలిగి నాగేష్, ఉపాధ్యక్షులుగా కొట్టాలపల్లి నాగేష్, కరకముక్కల గురుప్రసాద్, ఓబులేసు, అల్లేప్ప, ఉమాశంకర్, రామాంజనేయులు, గంగరాజు, ప్రధాన కార్యదర్శులుగా పోలికి సుధాకర్, నారాయణస్వామి, గంగన్న, తిప్పయ్య, సహాయ కార్యదర్శులుగా అంజి, బలరాం, భూపతి, నెట్టికల్లు, రాము, రామంజి, ట్రెజరర్లుగా విడపనకల్ నాగేంద్ర, కొట్టాలపల్లి సోమశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ హరిజన హాస్టల్ కమిటీ సభ్యులు ఆనంద్ రాజ్, వీరప్ప పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

నార్పల : మండల కేంద్రంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మేంద్రస్వామి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజాము నుంచే లక్ష్మీగణపతి హోమం, అయ్యప్పస్వామి మూల విరాట్‌కు నెయ్యాభిషేకం, పంచామృతాభిషేకాలు, పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న ఎన్ఎస్‌హెచ్ఆర్ జిల్లా అధ్యక్షులు కేశవకుమార్

ఎన్‌హెచ్‌ఆర్‌సి జిల్లా ఉపాధ్యక్షుడిగా కేశవకుమార్

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) జిల్లా ఉపాధ్యక్షుడిగా కేశవకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మున్సిపల్ అతిథిగృహంలో నిర్వహించిన సమావేశంలో సంఘం తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు సాయితేజ కొండిశెట్టి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీలాన్ బాషా, సలహాదారుడు లాయర్ ఓబులపతి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిచోటా హక్కుల ఉల్లంఘనలు సర్వసాధారణమయ్యారన్నారు. ఈ తరుణంలో హక్కుల ఉల్లంఘనలపై నేషనల్ హ్యూమన్ రైట్స్ తరపున మనం గట్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా సభ్యులు హరీష్, ప్రదీష్, వెంకట్, అమర్‌నాథ్, సాయిప్రసాద్, కృష్ణ, మురళి, బాబావలి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పాలు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి-యాడికి

ఎపి వడ్డెర కార్మిక సంఘం స్థాపించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎపి వడ్డెర కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షులు దేరంగుల నాగశేఖర్, ఉపాధ్యక్షులు మార్ల మధురాజు, యాడికి మండల వడ్డెర సంఘం అధ్యక్షులు వల్లెపు రాము, ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, నాగరాజు, దేరంగుల చంద్ర, రామాంజనేయులు, దేరంగుల రామకృష్ణ, శివ, శంకర్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.